# చార్‌ధామ్ యాత్ర - జలప్రళయ బీభత్సం - రచయిత భావన

మంచిని గ్రహించటానికి మానవులల్లో చూసి నేర్చుకునే వారు కొందరు, చెబితే నేర్చుకొనే వారు కొందరు, విపత్కర పరిస్థితుల్లో, విధిలేక గత జీవిత అనుభవాలు తల్చుకొని, మంచిని గ్రహించలేక పోయినందుకు బాధపడుతూ మంచిగా మారేవాళ్లు కొందరు. ఇటీవల చార్‌ధామ్‌లో జరిగిన ప్రళయంలో కొందరు బ్రతుకు భయంతో కొట్టుమిట్టాడుతూ వరదల్లో కొట్టుకుపోఅయూరు. బ్రతుకు భయంతో బ్రతకాలనీ పోరాడి తిండీ, నీళ్ళు లేక కొందరు వాతావరణ పరిస్థితికి తట్టుకోలేక, కొందరు రాళ్ళు దొర్లి పడి, వర్షంలో జారి లోయలో పడి కొందరు చనిపోయారు. ఇన్ని అవస్థలు పడి బ్రతికిన వారు మాత్రం మానవ జీవిత విలువలు తెలుసుకొని, ముందు జీవితం ఏ విలువలలో బ్రతకాలో నిర్ణయించుకొని ఉంటారు.

**మనిషి ఆఖరి దశలో ఆలోచనలు ఏ విధంగా ఉంటాయో ఒక ఉదాహరణ :**

గౌతమ బుద్ధుని కాలంలో ఒక గ్రామంలో ఒక తల్లి కొడుకు ఉండేవారు. ఆమె కుమారుడు ఏ పనీ చేసేవాడు కాదు. తల్లి వండి పెడితే తిని ఊరంతా బలాదూరు తిరిగేవాడు. కొడుకు ప్రయోజకుడు కాలేదనే బాధ ఉండేది. ఒకసారి గౌతమ బుద్ధుని వద్దకు తీసుకెళ్ళాలని నిర్ణయించుకుంది. కొడుకుకు ఈ విషయం ప్రతి రోజూ చెప్పి రమ్మని పిలిచేది. వెళ్ళేవాడు కాదు. ఒక రోజు అమ్మ చెప్పినట్లు బుద్ధుని వద్దకు వెళ్ళి వచ్చేస్తే, తరువాత రోజూ అమ్మతో గొడవ వుండదని నిర్ణయించుకున్నాడు. తన అమ్మతో కలిసి బుద్ధుని దగ్గరకు వెళ్ళాడు. ఆమె బుద్ధునికి పాదాభివందనం చేసింది. కొడుకుకు ఎంత చెప్పినా బుద్ధుని వద్దకు వచ్చి నమస్కరించలేదు. అప్పడు ఆమె నా కొడుకుకు బుద్ధి వచ్చేట్లు చేయమని బ్రతిమలాడింది. అప్పడు గౌతమ బుద్ధుడు వారి వద్దకు వచ్చి ఇప్పడు ఏమి బుద్ధి చెబుతాను, నీ కుమారుడు వారం రోజుల్లో చనిపోతాడు అని చెప్పి వెళ్ళి పోయారు. అప్పడు తన కుమారుడితో చావు భయంతో ఇల్లు చేరుకుంటారు. తల్లీ కొడుకు ఒకరినొకరు పట్టుకుని ఏడ్చుకుంటారు. తర్వాత తమ బంధువులు, స్నేహితులతో ఇల్లు నిండి పోయింది. ఏడ్చేవారూ, ఓదార్చేవారు అతనికి ప్రియమైన వంటలు చేసి పెట్టేవారూ. . . ఈ విధంగా ఇల్లంతా సందడిగా ఉంది. ఆఖరి రోజు వచ్చింది. ఇంక

ఇరవై నాలుగు గంటలు మిగిలింది. అప్పుడు. .. నేను మా అమ్మ చెప్పిన మాట విని నడుచుకుని ఉంటే బాగుండేది. ఇంతవరకు ఒక్క మంచి పని కూడా చేయలేకపోయాను. అందరినీ బాధలకు గురి చేశవాను. ఇంకా పరిపరి విధాల మంచి ఆలోచనలు చేస్తున్నాడు. ఇక రెండు గంటల సమయం మాత్రమే మిగిలిఉంది. అప్పుడు గౌతమ బుద్ధుడు వారింటి ముందుకు వచ్చి నిలబడ్డాడు. అప్పుడు ఆ తల్లి కొడుకు, అక్కడున్న ఇతరులు వచ్చి బుద్ధుని ముందుకు వచ్చి నిలిచారు. ఈ 24 గంటలు నీవు ఎవరికైనా చెడ్డ చేశావా? చెడ్డ తలిచావా? అని ఆమె కొడుకును అడిగాడు. అతను లేదు అన్నాడు. నీవు గత 24 గంటల్లో ఏమి ఆలోచించావో, ఆ విషయాన్ని నేను 24 సంవత్సరముల నుంచి ఆలోచిస్తున్నాను అని చెప్పి ఇక మీదట మంచిగా బ్రతుకు అని చెప్పి. . . నీవు ఎప్పుడు చనిపోయేదీ నాకు తెలియదు అని చెప్పి వెళ్ళిపోయాడు.

కాబట్టి ప్రతి ఒక్కరూ జీవిత ఆఖరిదశలో కాకుండా స్వార్థము, అసూయ వదలి ఇప్పటి నుంచే ఆలోచన చేసి మంచిని అమలు చేయుట మంచిది. ఈ పుస్తకం చదివిన వారు ఆలోచన చేస్తారని నమ్ముచున్నాను.